కేసుల పరిష్కారంలో వైఎస్ఆర్ జిల్లాకు రాష్ట్ర స్థాయి ర్యాంకు

ప్రజాశక్తి - కడప

జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ సంఖ్యలో కేసులు పరిష్కరించినందుకు గాను రాష్ట్ర స్థాయిలో కడప జిల్లాకు ర్యాంక్ వచ్చిందని జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి. యామిని, డిఎల్ఎస్ఎ ఎస్. బాబా ఫక్రుద్దీన్ ఒక సంయుక్త ప్రకటనలో పేర్కొన్నారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లావ్యాప్తంగా 21894 క్రిమినల్ కేసులు, 214 సివిల్ కేసులు, 63 ఫ్రీ లిటిగేషన్ కేసులు పరిష్కరించి రూ.16 కోట్ల 24 లక్షల 85 వేల 555 మొత్తాన్ని కక్షిదారులకు చెల్లించినట్లు తెలిపారు. కడపలో 2566 కేసులు, ప్రొద్దుటూరులో 894, రాజంపేటలో 1589, రాయచోటిలో1187, బద్వేల్‌లో 1397, మైదుకూరులో 1801, జమ్మలమడుగులో 4493, సిద్ధవటంలో 524 కేసులు పరిష్కారమయ్యాయని పేర్కొన్నారు. రైల్వేకోడూరులో 300, పులివెందులలో 2015, నందలూరులో 967, లక్కిరెడ్డిపల్లిలో 2092, కమలాపురంలో 2346 కేసులు జాతీయ లోక్ అదాలత్ లో పరిష్కరించినట్లు తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ లో కేసుల పరిష్కారానికి తోడ్పడిన న్యాయవాదులకు, అన్ని శాఖల అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రణాళికాబద్ధంగా జిల్లా అభివృద్ధికి కృషి

నూతన కలెక్టర్ నిశాంత్ కుమార్

ప్రజాశక్తి- రాయచోటి

ముఖ్యమంత్రి ఇచ్చిన సూచనల ప్రకారం ప్రణాళిక బద్ధంగా అన్నమయ్య జిల్లా అభివృద్ధికి కృషి చేస్తానని, అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా పని చేయడం అదృష్టంగా భావిస్తానని నూతన కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం రాయచోటి కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. కలెక్టర్ ఛాంబర్‌లో వేద పండితుల ఆశీర్వచనాల అనంతరం ఉదయం 11:30 గంటలకు నిశాంత్ కుమార్ అన్నమయ్య జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2014 ఐఎఎస్ బ్యాచ్‌కు చెంది ఎక్సైజ్ శాఖ డైరెక్టర్‌గా పని చేస్తున్న తనను రాష్ట్ర ప్రభుత్వం అన్నమయ్య జిల్లా కలెక్టర్‌గా నియమించిందన్నారు. ఇక్కడ పనిచేయడం అదృష్టంగా భావిస్తున్నట్లు చెప్పారు. సంయుక్త కలెక్టర్, సబ్ కలెక్టర్లు, డిఆర్ఒ, ఆర్‌డిఒ, జిల్లా అధికారుల బృందం, ప్రజా ప్రతినిధులు, ప్రజల సహకారంతో రాష్ట్ర ప్రభుత్వ ఆశయాలు ఆకాంక్షలకు అనుగుణంగా సంక్షేమ, అభివృద్ధి పథకాలను సమర్థవంతంగా అమలు చేసి జిల్లా అభివృద్ధికి పాటు పడతానని పేర్కొన్నారు. జిల్లాలో అభివృద్ధికి అవకాశం ఉన్న అంశాలపై దృష్టి సారించి జిల్లా ఆర్థిక అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. పరిశ్రమలు, మౌలిక సదుపాయాలు, రహదారులు, పునరుత్పాదక ఇంధన వనరులు ఇరిగేషన్ ప్రాజెక్టులపై దృష్టి సారిస్తానని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న రైతులకు ఆదాయం పెరిగేలా చర్యలు చేపడతామన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ ఆదర్శ రాజేంద్రన్, సబ్ కలెక్టర్లు కళ్యాణి, భావన, డిఆర్ఓ మధుసూదన్ రావు, రాయచోటి ఆర్‌డిఒ శ్రీనివాస్, ఎఒ నాగభూషణం పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. పలువురు జిల్లా అధికారులు, పాత్రికేయులు, ప్రముఖులు పుష్పగుచ్చాలు, పూల మొక్కలతో జిల్లా కలెక్టర్‌కు స్వాగతం పలికి అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ నిశాంత్ కుమార్

అన్ని శాఖలు సమన్వయంతో నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలి

జిల్లాలోని అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిర్దేశించిన లక్ష్యాలను సాధించాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ పేర్కొన్నారు. ఆదివారం ఉదయం జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన అనంతరం పిజిఆర్ఎస్ హాల్లో జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్దేశించిన లక్ష్యాల సాధనకు ప్రో యాక్టివ్‌గా పని చేయాలని, అన్ని శాఖలు సమన్వయంగా విధులు నిర్వహించాలని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సూపర్ సిక్స్ వంటి సంక్షేమ పథకాల అమలులో లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఈనెల 15, 16వ తేదీలలో అమరావతిలో నిర్వహించబోయే కలెక్టర్ల సదస్సును ఉద్దేశించి మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాకు సంబంధించి అతి ముఖ్యమైన విషయాలపై వివిధ శాఖల జిల్లా అధికారులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. జిల్లా అధికారులు వారి శాఖలకు సంబంధించిన సమస్యలను ముందే గుర్తించి వాటిని పరిష్కరించాలన్నారు. నిర్దేశించిన లక్ష్యాలకు ప్రణాళికలు రూపొందించుకొని జిల్లా అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

తొలి తెలుగు రాజకీయ ఖైదీ 'గాడిచర్ల'

సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ సంచాలకులు డాక్టర్ భూతపురి గోపాల కృష్ణశాస్త్రి

ప్రజాశక్తి - కడప అర్బన్

గాడిచర్ల హరిసర్వోత్తమరావు సంపాదకీయాలు స్వాతంత్ర్యోద్యమ కాలంలో ఆంగ్ల ప్రభుత్వానికి చెంపపెట్టులా ఉండేవని, అందువల్లనే ఆయన తన సంపాదకీయంలో ప్రభుత్వాన్ని పరుషంగా నిందించారనే నెపంతో జైలుకు పంపించారని, అలా తెలుగునేలలో ఆయనే తొలి తెలుగు రాజకీయ ఖైదీ అయ్యారని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సహాయ పరిశోధకులు డా.భూతపురి గోపాలకృష్ణ శాస్త్రి పేర్కొన్నారు. యోగి వేమన విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం ఆదివారం ప్రసిద్ధ స్వాతంత్ర్య సమరయోధులు, పత్రికా సంపాదకులు, గ్రంథాలయ ఉద్యమనాయకులు గాడిచర్ల హరిసర్వోత్తమరావు 142వ జయంతిని నిర్వహించింది. గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ గాడిచర్ల 1907లో స్వాతంత్ర్యోద్యమంలో ప్రవేశించారని, రాజమండ్రిలో ఉపాధ్యాయ శిక్షణ పొందుతూ బిపిన్‌చంద్రపాల్ ఉపన్యాసాలతో ఉత్తేజితులై వందేమాతరం ఉద్యమానికి నాయకత్వం వహించారన్నారు. అందువల్ల ఆయనను బ్రిటీష్ ప్రభుత్వం కళాశాల నుంచి బహిష్కరించడమే కాక ఎక్కడా ఉద్యోగం ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. స్వాతంత్ర్యోద్యమంలో బాలగంగాధర తిలక్‌లా ఆయన ప్రదర్శించిన ధైర్యసాహసాలను మెచ్చి ప్రజలు ఆయనను 'ఆంధ్ర తిలక్' అని పిలిచారన్నారు. మహిళల సమస్యల పరిష్కారం కోసం ఆయన 'సౌందర్యవల్లి' అనే పత్రిక నడిపారన్నారు. మరో సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమం ముమ్మరంగా సాగుతున్న కాలంలో గాడిచర్ల హరిసర్వోత్తమరావు గ్రంథాలయ ఉద్యమం ద్వారా, తన సంపాదకీయాల ద్వారా ప్రజల్లో స్వాతంత్ర్యోద్యమ స్ఫూర్తిని నింపారన్నారు. కడప జిల్లా పర్యటనలో గాంధీజీ ప్రసంగాలను గాడిచర్లయే అనువదించారన్నారు. గాడిచర్ల పత్రికారంగంలోకి అడుగుపెట్టి 'స్వరాజ్య' అనే తెలుగు పత్రికను ప్రారంభించి ఆంగ్ల ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టారన్నారు. సంపాదకుడుగా ఆయన ఎన్నో కొత్త పదాలు పుట్టించారని, 'ఎడిటర్' అనే పదానికి 'సంపాదకులు' అనే పేరు పెట్టింది ఆయనే అన్నారు. రచయిత కొత్తపల్లి రామాంజనేయులు మాట్లాడుతూ స్వాతంత్ర్యోద్యమ సమయంలో గాడిచర్ల జైలులో చాలా దుర్భర జీవితాన్ని అనుభవించారన్నారు. కాళోజీ గాడిచర్లను కీర్తిస్తూ చెప్పిన కవితను వినిపించారు. కార్యక్రమంలో సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం జూనియర్ అసిస్టెంట్లు ఆర్.వెంకటరమణ, ఎం.మౌనిక, సిబ్బంది, పాఠకులు చంద్రశేఖర్, రంగా, వెంకట నగేశ్ పాల్గొన్నారు.

గాడిచర్ల హరిసర్వోత్తమరావు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రముఖులు

సమావేశంలో మాట్లాడుతున్న మునిగోపాలకృష్ణ

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కమిషన్

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

సీనియర్ సిటిజన్లకు ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, అన్నమయ్య జిల్లా అధ్యక్షులు డాక్టర్ ఎన్.మునిగోపాలకృష్ణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక జిఆర్‌టి ఇంగ్లీష్ మీడియం స్కూల్‌లో సీనియర్ సిటిజెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునిగోపాలకృష్ణ మాట్లాడుతూ కేరళ రాష్ట్రంలో అమలు చేస్తున్న విధంగా ఎపిలోను వయోవృద్ధుల సమస్యల పరిష్కారం కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. రోజురోజుకు వయో వృద్ధులపై దాడులు పెరిగిపోతున్న నేపథ్యంలో వాటి నియంత్రణకు 2007 చట్టాన్ని కఠినంగా అమలు చేయాలన్నారు. కరోనా సమయంలో కేంద్రం రద్దు చేసిన రైల్వే రాయితీని తిరిగి పునరుద్ధరించాలని, రాష్ట్రంలో వయోవృద్ధులకు ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ శ్రీనివాసులు, వై.యస్ మునిరత్నం, న్యాయవాది అనురాధ, గొల్లపూడి తిరుపతి రావు, కామకోటి ప్రసాద్ రావు, నాగమణి, జగన్ మోహన్, ఎన్.వి నాయుడు, సభ్యులు పాల్గొన్నారు.

లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు అంగన్వాడీ అధ్యక్షులుగా సుకుమారి

ప్రజాశక్తి-లక్కిరెడ్డిపల్లి :లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్టు మహాసభ ప్రాజెక్ట్ అధ్యక్షులు సుకుమారి అధ్యక్షతన ఆదివారం చిల్డ్రన్ హోంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి రామాంజులు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భాగ్యమ్మ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లక్కిరెడ్డిపల్లి ప్రాజెక్ట్ అంగన్వాడీ వర్కర్స్ అధ్యక్షురాలుగా సుకుమారి ప్రధాన కార్యదర్శి ఓబులమ్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ లక్ష్మీదేవి, సహాయక కార్యదర్శి శ్రీవాణి, గౌరవ అధ్యక్షులుగా ప్రభావతిలను సభ్యులందరూ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రామాంజులు మాట్లాడుతూ రాబోయే కాలంలో అంగన్వాడీ సమస్యల కొరకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని అంగన్వాడీలకు కనీస వేతనాలు పెంచాలని భవిష్యత్తులో అంగన్వాడీ సమస్యలు పోరాటానికి అంగన్వాడీ లందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు ఆయాలు పాల్గొన్నారు.

అంగన్వాడీ ప్రాజెక్టు అధ్యక్షురాలు సుకుమారి ఎన్నుకుంటున్న సభ్యులు

సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులతో ఎన్‌సిసి అధికారులు

ఎన్‌సిసిలో ప్రతిభ చాటిన 'మిట్స్' విద్యార్థులు

ప్రజాశక్తి-మదనపల్లె

మిట్స్ డీమ్డ్ టుబి యూనివర్సిటి ఎన్‌సిసి క్యాడెట్లు 2024-25 విద్యా సంవత్సరానికి నిర్వహించిన ప్రతిష్టాత్మక 'బి' 'సి' సర్టిఫికెట్ పరీక్షల్లో వంద ఉత్తీర్ణత సాధించారు. ఈ విషయాన్ని విసి డాక్టర్ సి.యువరాజ్ తెలిపారు.మొత్తం 45 మంది క్యాడెట్లు 'బి' సర్టిఫికెట్ పరీక్షలో 6 ఎ గ్రేడ్‌లు, 39 బి గ్రేడ్‌లు సాధించగా, 29 మంది క్యాడెట్లు 'సి' సర్టిఫికెట్ పరీక్షలో 26 ఎ గ్రేడ్‌లు, 3 బి గ్రేడ్‌లు సాధించారు. విజయోత్సవ కార్యక్రమంలో 35 ఆంధ్ర బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ కల్నల్ ఎన్.వి. మోనిష్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ లెఫ్టినెంట్ కల్నల్ పి. లోగనాథన్ సర్టిఫికెట్‌లను అందజేశారు. క్యాడెట్ల అంకితభావం, క్రమశిక్షణ, మెంటర్ల మార్గదర్శకత్వం ఈ విజయానికి కారణమని యూని వర్సిటీ యాజమాన్యం పేర్కొంది. ఎన్‌సిసి సర్టిఫికెట్లు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, జట్టుకృషి, దేశభక్తి పెంపొందించడంలో కీలకమని పేర్కొన్నారు. కార్యక్రమంలో యూని వర్సిటీ ఎన్‌సిసి ఆఫీసర్, లెఫ్టినెంట్ డాక్టర్ నవీన్ కుమార్ పాల్గొన్నారు.

బలిజసేన జిల్లా అధ్యక్షులుగా నరసింహ

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రాష్ట్ర బలిజ సేన అన్నమయ్య జిల్లా అధ్యక్షులుగా రాజంపేట భువనగిరి పల్లెకు చెందిన కే.ఎస్ నరసింహను బలిజ సేన వ్యవస్థాపకులు అరకాట్ కృష్ణ ప్రసాద్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం తిరుపతిలోని ఉదయి ఇంటర్నేషనల్ హోటల్‌లో జరిగిన బలిజల ఆత్మీయ సమావేశంలో నరసింహను అన్నమయ్య జిల్లా బలిజ సేన అధ్యక్షుడిగా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, రాష్ట్ర హస్తకళల చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ మాట్లా డుతూ బలిజలు ఐక్యంగా ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని ఆకాంక్షించారు. బలిజ సేన రాష్ట్రవ్యాప్తంగా ఉన్న బలిజ, కాపు, ఒంటరి, మున్నూరు కాపు వంటి బలిజ సామాజిక వర్గానికి చెందిన అన్ని వర్గాలను కలుపుకొని ఆంధ్ర రాష్ట్రంలో తిరుగులేని శక్తిగా వృద్ధి చెందాలన్నారు. నరసింహ మాట్లాడుతూ తనపై విశ్వాసంతో తనను జిల్లా అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. అందరినీ కలుపుకొని బలిజ సామాజిక వర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని పేర్కొన్నారు. అనంతరం కే.ఎస్ నరసింహను శాలువాతో ఘనంగా సన్మానించి జ్ఞాపకను అందించారు. కార్యక్రమంలో బలిజ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు గీతాంజలి రమణ, మస్తాన్ రాయల్, రెడ్డి రాణి, అబ్బిగారి గోపాల్, రాయలసీమలోని అన్ని జిల్లాల నుంచి బలిజ, కాపు కుల పెద్దలు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయం తప్పనిసరి

- 9,500 క్వింటాళ్ల ఉలవలకు ప్రతిపాదనలు
- జిల్లాలో సాగు 18 శాతమే
జిల్లా వ్యవసాయాధికారి విజయకుమార్

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

ఖరీఫ్ సీజన్‌లో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక సిద్ధమైంది. ఈఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో 18 శాతం విస్తీర్ణంలోనే విత్తనం వేయడం జరిగింది. ఇందులో జిల్లాలోని ప్రధాన ఆహారపు పంటలైన వేరుశనగ, వరి, కంది, మొక్కజొన్న, సజ్జ పంటల సాగు ప్రశ్నార్థకంగా మారింది. ఇందులోభాగంగా జిల్లా సాధారణ సాగు లక్ష్యమైన 1.30 లక్షల ఎకరాలకుగానూ 26 వేల ఎకరాల్లోనే విత్తనం పడింది. మదనపల్లి నియోజకవర్గ ప్రాంతంలో వ్యవసాయబోర్ల కింద సాగునీరు అందుతున్న నేపథ్యంలో వరి సాగు అంతంతమాత్రాన నోచుకుంది. ఇటువంటి పరిస్థితుల నేపథ్యంలో ఖరీఫ్ సాగు లక్ష్యాన్ని చేరుకోవడానికి కిందుమీదులవుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఇటువంటి ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో ప్రత్యామ్నా య పంటల సాగుకు సంబంధించిన ప్రణాళిక ప్రతిపాదనల్ని రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశామని పేర్కొంటున్న అన్నమయ్య జిల్లా వ్యవ సాయశాఖ అధికారి జి.శివన్నారాయణతో ముఖాముఖి...

ముఖా ముఖి..

ఖరీఫ్ తీరుతెన్నులపై స్పందించండి?

2025 ఖరీఫ్ సీజన్ తీవ్ర వర్షాభావ పరిస్థితుల మధ్య కొనసాగుతోంది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణమైన 1,30,000 ఎకరాల్లో పంటలు సాగు కావాల్సి ఉంది. ఈఏడాది ఖరీఫ్ సీజన్ మొదలు నుంచి నేటి వరకు ప్రతికూల వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో 26 వేల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. ఈలెక్కన సుమారు 18 శాతం విస్తీర్ణంలో విత్తనం పడింది. మిగిలిన 82 శాతం విస్తీర్ణంలో విత్తనం పడని పరిస్థితి కనిపిస్తోంది.

ప్రధాన ఆహార పంటల పరిస్థితేమిటి?

జిల్లాలో వేరుశనగ, వరి, కందులు, మొక్కజొన్న, సజ్జ ప్రధాన పంటలు. ఇందులోని ప్రధాన ఆహారపు పంట వేరు శనగ 38,000 ఎకరాల్లో సాగు చేయాల్సి ఉంది. తీవ్ర వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో 4,650 ఎకరాలకు పరిమితమైంది. 15 రోజుల్లో ఖరీఫ్ సీజన్ ముగింపు దశకు చేరుకుంటోంది. జిల్లాలో తీవ్ర వర్షాభావ పరిస్థితుల కారణంగా ఎండుతున్న పంటల నుంచి దిగుబడులు ఏ స్థాయిలో ఉంటాయో వేచి చూడాల్సి ఉంది. ఇదే తరహాలో 11,500 ఎకరాల్లో వరి సాగు చేయాల్సి ఉంది. కానీ ఇప్పటి వరకు 10,000 ఎకరాల్లో సాగైంది. గతంలో ఎకరా వరి సాగు కు 25 బస్తాలు దిగుబడి ఏమేరకు లభిస్తుందో చూడాలి.

డ్రోన్ల లభ్యత ఎలా ఉంది?

జిల్లాలోని 30 మండలాల్లో మండలానికి ఒకటి చొప్పున డ్రోన్ అందించాల్సి ఉంది. మొదటివిడతలో భాగంగా 25 మందిని గుర్తించడమైంది. ఇందులో 16 డ్రోన్స్ సరఫరా చేయడమైంది. మిగిలిన వాటిని త్వరలో అందు బాటులోకి తెచ్చే ప్రయత్నం చేస్తున్నాం.

ఇ-క్రాప్ నమోదు ఎలా ఉంది?

రాష్ట్రంలో అన్నమయ్య జిల్లా నాలుగవ స్థానంలో ఉంది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణమైన 1,30 లక్షల ఎకరా లను ఇ-క్రాఫ్ పరిధిలోకి తీసుకుని రావడమైంది.

భూసార పరీక్షలపై స్పందించండి?

భూసార పరీక్షలు లక్ష్యాన్ని అధిగమిస్తాం. 2025లో 23 వేల మట్టి శ్యాంపిళ్లను పరీక్షించాలనే లక్ష్యాన్ని నిర్ణయించాం. ఇందు లోభాగంగా కడప జిల్లాకు 11,500 వేల శాంపిళ్లను పంపించ డమైం ది.మిగిలిన 11,500 శాంపిళ్ల పరీక్షల్ని పరీక్షించాల్సిన అవసరం ఉంది.

ప్రత్యామ్నాయ ప్రణాళిక ఏమైనా ఉందా?

కంటిజెన్స్ ప్రణాళిక ప్రతిపాదనలు పంపించడమైంది. 9,800 క్వింటాళ్ల మేర కు ఉలవ విత్తన పంపిణీ చేయడానికి ప్రతిపాదనలు పంపించడమైంది. కంటిజెన్స్ ప్రణాళిక, ఎరువుల పరిమాణం, విత్తన కేటాయింపులకు సంబంధించి కమిషనరేట్ నుంచి అనుమతులు రావాల్సి ఉంది.

108 వాహనంలో సుఖప్రసవం అయిన గర్భిణి

వైద్యుల నిర్లక్ష్యం..
108 వాహనంలో ప్రసవం

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

వైద్యుల నిర్లక్ష్యంతో ఓ గర్భిణి దారిలోనే ప్రసవించింది. బాధితులు తెలిపిన వివరాల మేరకు.. మదనపల్లె మండలం, బసినికొండకు చెందిన భాగ్యమ్మ అనే గర్భిణి ఆదివారం వేకువ జామున ప్రసవ వేదనతో ఉండగా గమనించిన కుటుంబీకులు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి కి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు మహిళకు ప్రసవం కష్టంగా ఉందని, ఏమాత్రం ఆలస్యం చేయకుండా తిరుపతికి వెళ్లండంటూ రెఫర్ చేశారు. కుటుంబ సభ్యులు ఆమెను నిమ్మనపల్లె 108లో తీసుకుని రుయాకు బయలుదేరారు. కాగా మార్గమధ్యంలోని బాకరాపేటకు వెళ్లేసరికి నొప్పులు ఎక్కువ కావడంతో 108 సిబ్బంది చొరవ తీసుకుని సుఖ ప్రసవం చేయడంతో పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ఇదీ మదనపల్లె ప్రభుత్వ అస్పత్రిలో వైద్యుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా తెలుస్తోంది.

నేడు యథావిధిగా
'ప్రజాసమస్యల పరిష్కార వేదిక'

ప్రజాశక్తి-రాయచోటి

ప్రజల నుంచి వారి సమస్యలను స్వీకరించి, వాటిని పరిష్కరించేందుకు సోమవారం ఉదయం 10 గంటల నుంచి ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని జిల్లా కేంద్రం రాయచోటి తో పాటు గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో యథావిధిగా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ శ్రీధర్ చామకూరి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు తమ విజ్ఞప్తులను సంబంధిత గ్రామ, మండల, డివిజన్లలో అధికారులకు ఇవ్వాలని ఆయన సూచించారు. మండల, డివిజన్ స్థాయిలో సమస్యలు పరిష్కారం కాని అర్జీదారులే జిల్లా కేంద్రంలో జరిగే ప్రజా సమ స్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి రాగలరని తెలిపారు.

వేరుశనగ రైతులను ఆదుకోవాలి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

బూడిద తెగులుతో వేరుశనగ పంట పూర్తిగా దెబ్బతిందని, రైతన్నలను నిండా ముంచేసిందని కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగం రామకృష్ణారెడ్డి పేర్కొన్నారు. కోసువారిపల్లి, పెద్దగుట్టపల్లి గ్రామాల్లో బూడిద తెగులుతో దెబ్బతిన్న వేరుశనగ పంటలను ఆదివారం ఆయన రైతులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సింగం రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ పంటలో వ్యాధి విస్తరించి ఆకులు, మొక్కలు ఎండిపోవడంతో రైతులు భారీగా నష్టాలను ఎదుర్కొంటున్నారన్నారు. గత ప్రభుత్వాలు, ముఖ్యంగా కాంగ్రెస్ పార్టీ పాలనలో ఇలాంటి పంటనష్టాలు సంభవించినప్పుడు పంటను రిజిష్టర్ చేసి తగిన పరిహారం అందించేవారన్నారు. అయితే ప్రస్తుత కూటమి ప్రభు త్వంలో సచివాలయ ఉద్యోగులు రైతులను సచివాలయం వద్దకు పిలిపించి వివరాలు తీసుకుంటున్నారని ఆరోపించారు. బూడిద తెగులు కారణంగా వేరుశనగ పంటను కోల్పోయిన రైతులు తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నారన్నారు. వెంటనే వ్యవసాయ అధికా రులు క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి రైతులకు తగిన నష్టపరిహారం అందిం చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వేరుశనగ పంటలపై బూడిద తెగులుతో వచ్చిన ఈ సమస్య తక్షణం పరిష్కరించకపోతే వచ్చే సీజన్‌లో రైతులు వేరు శనగ సాగును తగ్గించే అవకాశం ఉందన్నారు. రైతుల సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ పార్టీ ముందుండి పోరాడుతుందని స్పష్టం చేశారు.

వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రామకృష్ణారెడ్డి

కంటి పరీక్షలు చేస్తున్న వైద్యులు

27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు

ప్రజాశక్తి - రాయచోటి

పట్టణ పరిధిలోని చెన్నముక్కపల్లిలో ఉన్న లయన్స్ కంటి ఆసుపత్రిలో ఆదివారం 27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంతో పాటు జిల్లా పరిధిలోని రాజంపేట, రైల్వే కోడూరు, పీలేరు నియోజకవర్గంలోని కెవిపల్లె, ఎర్రవారిపాలెం, కలకడ, కలికిరి, గుర్రంకొండ,పెద్దమండెం, కదిరి, ఎన్.పి.కుంట, చక్రాయపేట తదితర ప్రాంతాల నుంచి వచ్చిన 60 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించిన కంటి వైద్యులు అందులో అర్హులైన 27 మంది కంటి రోగులకు ఆపరేషన్లు నిర్వహించారు. గతంలో ఆపరేషన్ చేయించుకున్న 35 మంది కంటి రోగులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా అద్దాలు, మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ కంటి ఆసుపత్రి చైర్మన్ వైవిఆర్ స్వరూప గుప్తా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్ బాష, చెన్నముక్కపల్లె మాజీ సర్పంచ్ శ్రీనివాసులు రెడ్డి, కంటి వైద్యులు సురేష్ బాబు, భార్గవి, ఆప్తమాలిక్ అసిస్టెంట్ మూలి రాజగోపాల్ రెడ్డి, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రాములోరి కల్యాణం

-హాజరైన చమర్తి జగన్‌మోహన్‌రాజు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

మండల పరిధిలోని హత్యరాల గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రాములవారి దేవస్థానంలోనిర్వహించిన శ్రీ సీతారాముల కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజంపేట టిడిపి ఇన్‌ఛార్జి చమర్తి జగన్మోహన్‌రాజు పాల్గొన్నారు. గ్రామస్తులు ఆయనకు మేళతాళాలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులతో కలిసి చమర్తి జగన్మోహన్ రాజును శాలువా, పూలమాలతో ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ గన్నే సుబ్బనర్సయ్య నాయుడు, మండల రూరల్ ఉపాధ్యక్షుడు సతీష్ రాజు, టెక్సమో మల్లిఖార్జుననాయుడు, టిఎన్ఎస్ఎఫ్ పార్లమెంటు అధ్యక్షుడు పోలి శివకుమార్, ఆలయ కమిటీ సభ్యులు చవన ఈశ్వరయ్య, కొవ్వూరు ఈశ్వరయ్య, రోహిత్, శివ పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్
డైరెక్టర్‌గా రామకృష్ణ ఆచారి

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టరుగా మదనపల్లె కు చెందిన పచ్చిపాల రామకృష్ణఆచారి నియమితులయ్యారు. టిడిపి అధిష్టానం నియా మకపు ఉత్తర్వులను జారీ చేసింది. ఈ నేపథ్యంలో అఖిల భారతీయ స్వర్ణకార సంఘం కార్యదర్శి, ఎబిసి స్వచ్ఛంధ సంస్థ వ్యవస్థాపకులు డాక్టర్ అప్పినపల్లి భాస్క రాచారి ఆది వారం పచ్చిపాల రామకృష్ణ ఆచారి, ఆయన సతీమణి 20వ వార్డు కౌన్సిలర్ పచ్చిపాల తులసిలను కలిసి పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం భాస్కరాచారి మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి ప్రభుత్వం బిసిలకు అధిక ప్రాధాన్యతనిస్తోందన్నారు. తెలుగుదేశం పార్టీకి రామకృష్ణ ఆచారి అందించిన సేవలను గుర్తించి ఎపి విశ్వబ్రాహ్మణ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమించడం శుభసూచకమన్నారు. ఈ పదవికి రామకృష్ణ ఆచారి వన్నెతీసుకొస్తారని ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా విశ్వబ్రాహ్మణులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వారి అభ్యున్నతికి కృషి చేయాలని సూచించారు. రామకృష్ణ ఆచారి భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు.

రామకృష్ణ ఆచారిని సన్మానిస్తున్న భాస్కరాచారి

నిస్సార్ అహమ్మద్‌కు స్వాగతం పలుకుతున్న వైసిపి నాయకులు

వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

వైసిపి మళ్లీ అధికారంలోకి రావడం ఖాయమని మదనపల్లి వైసిపి సమన్వ యకర్త నిస్సార్‌అహమ్మద్ పేర్కొన్నారు. ఆదివారం నిమ్మనపల్లె జోయల్ గాస్పెల్ మినిస్ట్రీ చర్చిలో నిర్వహించిన ప్రత్యేక ప్రార్థనలలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చర్చి నిర్వహకులు ఫాదర్ జయకుమార్, క్రిస్టియన్ మతపెద్దలు, స్థానిక వైసిపి నాయకులు నిస్సార్‌అహమ్మద్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభువు దీవెనలు అన్ని వర్గాల ప్రజలపై ఉండాలని, సర్వమత సామరస్యం యేసు క్రీస్తు ఆకాంక్ష అని అన్నారు. ప్రజలు ఆరోగ్యంగా, సంతోషంగా ఉంటూ సమాజానికి చేతనై నంత సేవా చేయాలన్నారు. ప్రజల అండదండలు వై.ఎస్. జగన్‌కు ఎప్పుడూ ఉంటా యన్నారు. ప్రజా బలంతో తిరిగి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక ర్తలు, నాయకులు కలసి కట్టుగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో వైసిపి విద్యార్థి విభాగం జాయింట్ సీక్రెటరీ హేమంత్ కుమార్, మండల ప్రధాన కార్యదర్శి ఖాదర్‌బాషా, యోగానంద రెడ్డి, వేముల రెడ్డి శివకృష్ణ, డవ్ నాగరాజు, నవాజ్, దామోదర్, రవితేజ, సుధాకర్,రెడ్డి భాస్కర పాల్గొన్నారు.

పనిచేయని నీటిబోరు

దాదంవారిపల్లెలో తాగునీటి కష్టాలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండలంలోని దాదంవడ్డిపల్లెలో 10రోజుల క్రితం మంచినీటి బోరు పాడై తాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఐదు రోజుల క్రితం మోటారును అధికారులు బోరు బావిలో నుంచి తీశారని నేటి వరకూ ఇటువైపు కన్నెత్తి చూడలేదని వాపోయారు. తాగునీటి కోసం కిలో మీటర్ దూరంలో ఉన్న వ్యవసాయ బోర్ల వద్దకు వెళ్లి తెచ్చుకోవాల్సి వస్తోందన్నారు. అధికారులు స్పందించి వెంటనే బోరు మోటార్ ఏర్పాటు చేసి తాగునీటి సమస్య తీర్చాలని కోరుతున్నారు.

రేషన్ డీలర్లకు ఇ-పాస్ మిషన్లు పంపిణీ

ప్రజాశక్తి-బి.కొత్తకోట

స్మార్ట్ రేషన్ కార్డుల వినియోగం కోసం రేషన్ డీలర్లకు కొత్త ఇపాస్ మిషన్లను మంజూరు చేస్తోంది.ఆదివారం సబ్ కలెక్టర్ కార్యాలయం సీఐడీటి సుబ్బయ్య చేతుల మీదుగా బి.కొత్తకోట మండలంలోని రేషన్ దుకాణ డీలర్లకు ఈపాస్ మిషన్లను అందించారు. ఈ సందర్భంగా సిఐటిడి సుబ్బయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా మంజూరు చేసిన ఈ పాస్ మిషన్లు సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందిం చారన్నారు. ఈ మిషన్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ సులభతరం అవుతుందన్నారు. కావున ఇపాస్ మిషన్లను ప్రతి రేషన్‌డీలర్ సద్వినియోగం చేసుకోవాల న్నారు. కార్యక్రమంలో బి.కొత్తకోట రేషన్ డీలర్లు డేరంగుల నాగరాజు,వెంకటరమణ పాల్గొన్నారు.

ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం

ప్రజాశక్తి-నందలూరు

చదువు నేర్పిన గురువులకు పాఠశాలకు రుణం తీర్చుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని నాగిరెడ్డిపల్లె మేజర్ గ్రామపంచాయతీ మాజీ సర్పంచ్ సమ్మెట శివప్రసాద్ పేర్కొన్నారు. నాగిరెడ్డిపల్లి జడ్‌పి హైస్కూల్‌లో పాఠశాలలో 1993-94 విద్యా సంవత్సరంలో పదవతరగతి చదివిన పూర్వ విద్యార్థులు సమ్మెట శివప్రసాద్, ఏనుగుల బాలాంజనేయులు ఆధ్వర్యంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పూర్వ గురువులైన రాధాకృష్ణ, వెంకటరెడ్డి, హనుమంతు రెడ్డి, చలమయ్య, నిసార్, సుధాకర్, లక్ష్మీదేవి, చంద్రకుమారి, శకుంతల లకు శిష్యులు, పాదపూజ చేసి, పట్టుశాలువా, పూల మాలల తో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు బండాత్మకూరు శివ కుమార్ శర్మ, సుబ్రహ్మణ్యం, రవికుమార్, ఫజులు, నాగభూ షణం, జయశ్రీ,సుజాత, ఉమామహేశ్వరి పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

హిందీ భాషోపాధ్యాయులకు సన్మానం

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లె జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో పని చేస్తున్న హిందీ భాషో పాధ్యా యులను ఘనంగా సన్మా నించారు. హిందీ భాషా దినోత్సవం సందర్భంగా ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో హెచ్‌ఎం శివమునెమ్మ మాట్లా డుతూ దేవనాగరి లిపిగా పేరున్న భాష హిందీ అన్నారు. మాతృభాషలో చక్కగా రాణించే విద్యార్థి ఇతర భాషల్ని సులభంగా అధ్య యనం చేయగలుగుతారని తెలిపారు. చిన్నపాటి సూచనలు పాటిస్తే హిందీ సులభంగా నేర్చుకోవచ్చు అన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీల్లో రాణించిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. హిందీ పట్ల భయం విడనాడాలని విద్యార్థులకు సూచించారు. సరళంగా హిందీని నేర్చుకోవచ్చుని, భయాందోళన అవసరం లేదన్నారు. హిందీ ఉపాధ్యాయులు లత, పర్వీన్, వసంతకు శివ మునెమ్మ శాలువతో సత్కరించి, మెమెంటోను అందజేశారు.

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలి

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎపిటిఎఫ్ నాయకులు ఎమ్మెల్యే ఎన్.వరదరాజులరెడ్డిని కోరారు. ఆ మేరకు వారు ఆదివారం ఎమ్మెల్యే కార్యాలయంలో ఎపిటిఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.శ్యాంసుందర్‌రెడ్డి ఆధ్వర్యంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్యాంసుందర్‌రెడ్డి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న నాలుగు విడతల డిఎను వెంటనే ప్రకటించాలన్నారు. 30 శాతం మధ్యంతరభృతి చెల్లించాలని కోరారు. సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పెన్షన్ విధానాన్ని పున రుద్ధరించాలన్నారు. మెమో 57 ప్రకారం 2003 డిఎస్సీ ఉపాధ్యాయులకు పాతపెన్షన్ విధానాన్ని వర్తింపజేయాలని కోరారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యలను సిఎం, విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో పూర్వ జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణారెడ్డి, జిల్లా కార్యదర్శి రమేష్‌రెడ్డి, పట్టణశాఖ అధ్యక్షుడు ఈశ్వరరెడ్డి, ప్రొద్దుటూరు మండలశాఖ అధ్యక్షుడు సుబ్బారెడ్డి, రాజుపాళెం మండలశాఖ అధ్యక్షకార్యదర్శులు నరసింహ కుమార్, రామదస్తగిరి రెడ్డి, జిల్లా కౌన్సిలర్లు సుబ్బయ్య, జాన్ సురేష్, నారాయణరెడ్డి, రమణారెడ్డి, గురివిరెడ్డి పాల్గొన్నారు.

అధ్వానంగా గొల్లపల్లి రోడ్డు

గుంతలమయంగా ఉన్న రోడ్డు

ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

ప్రజాశక్తి-గాలివీడు

మండల పరిధిలోని కదిరి-రాయచోటి ప్రధాన రహదారి నుంచి గోపనపల్లి వరకు రెండు కిలోమీటర్ల రహదారి గుంతమయంగా మారి అధ్వానంగా మారడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షం వస్తుందంటే రోడ్డు నీటిమ డుగులు ఏర్పడుతుండటంతో తరుచుగా ప్రమాదాలకు గురవుతున్నామని వాహన దారులు ఆవేదన వ్యక్తం చేస్తు న్నారు. ఆటోలు, స్కూల్ వ్యాన్లు వెళ్లాలన్నా కష్టతరంగా మారుతుం దన్నారు. ద్విచక్ర వాహనాలు వెళ్లాలంటే మరి ఇబ్బందికరంగా ఉందని వాపోతున్నారు. వాహనదారులు కరిమిరెడ్డిగారిపల్లి నుంచి గోపనపల్లి రోడ్డు వరకు వెళ్లడానికి కూడా రోడ్డు సౌకర్యం దెబ్బతిని ప్రజలు అవస్థలు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తారురోడ్డు మంజూరు చేయాలనికోరుతున్నారు.

తారు రోడ్డు నిర్మాణానికి నిధులు

గోపనపల్లి తారు రోడ్డు నిర్మాణానికి రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి నిధులు మంజూరు చేయడానికి కృషి చేస్తు న్నారు. త్వరలో టెండర్లు పూర్తి చేసి రోడ్డు నిర్మాణ పనులు చేపడతారన్నారు.

- మిట్టపల్లి. వెంకటరమణారెడ్డి పేర్కొన్నారు.

గండి వరకు బస్సు సౌకర్యం

తారు రోడ్డు నిర్మాణం పూర్తయితే గండి వరకు బస్సు సౌకర్యం కలుగుతుంది. రోడ్డు నిర్మా ణం పూర్తయిన వెంటనే గండి వరకు బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేయడానికి మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి సమ్మతించారు. నిర్మాణానికి టెండర్లు అయిన వెంటనే పనులు సకాలంలో పూర్తయితే బస్సు సౌకర్యాన్ని గోపనపల్లి ప్రజలు పొందే అవకాశం లభిస్తుంది. **-కోటిరెడ్డి,గాలివీడు**

రూ.4కోట్లతో టెండర్లు

గోపనపల్లి నుంచి శివపురంవారిపల్లి మీదుగా పందికుంట తాండ వరకు ఉన్న తారు రోడ్డును కలపడం కొరకు రూ.4కోట్లతో ప్రాజెక్ట్ ఇంప్లిమెంటేషన్ యూనిట్ కింద మంజూరు అయ్యాయి. గోపనపల్లి ఆర్చ్ నుంచి తొమ్మిది కిలోమీటర్ల వరకు తారు రోడ్డు నిర్మాణం పూర్తి కావడానికి టెండర్ అయిన వెంటనే నిర్మాణం పనులు చేపడతాం. **-సందీప్, ఎఇ**

'మందా'కు నామినేటెడ్ పదవి ఇవ్వాలి

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

రెండు దశాబ్దాలకు పైగా పసుపు జెండా మోస్తూ ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొని పార్టీ బలోపేతానికి కృషిచేసిన టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మందా శ్రీనివాసులకు రాష్ట్రస్థాయి నామినేటెడ్ పదవి కేటాయించాలని ఎంఆర్‌పిఎస్ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో పాత్రికేయుల సమావేశంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు మాట్లాడుతూ ఒక సామాన్య కార్యకర్తగా గ్రామస్థాయి నుంచి ప్రస్థానం మొదలుపెట్టిన మందా శ్రీను పార్టీ కోసం చిత్తశుద్ధితో పనిచేసి టిడిపి పట్టణ యువత అధికార ప్రతినిధిగా, జిల్లా ఉపాధ్యక్షులుగాను, ప్రధాన కార్యదర్శి గానూ, రాపూరు నియోజకవర్గ పరిశీలకులుగానూ విశేష సేవలందించారన్నారు. ప్రస్తుతం ఎస్‌సి సెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శిగా కొనసాగు తున్నారని తెలిపారు. టిడిపిలో మదన్‌మోహన్‌రెడ్డి హయాం నుంచి పసుపులేటి బ్రహ్మయ్య, మేడా మల్లిఖార్జునరెడ్డి, బత్యాల చెంగలరాయుడు, సుగవాసి బాలసుబ్ర హ్మణ్యం తో పాటు ప్రస్తుత తెలుగుదేశం పార్టీ రాజంపేట నియోజకవర్గ బాధ్యులు చమర్తి జగన్మోహన్‌రాజు వరకు అందరితో కలిసి పని చేసి పార్టీ పటిష్టతకు కృషి చేశారన్నారు. గత వైసిపి విధ్వంస పాలనలో అనేక దాడులను ఎదుర్కొని, అక్రమ కేసులు సైతం తట్టుకుని నిలబడి ఎన్నో ఒడిదుడుకులు పడ్డారన్నారు. నియోజకవర్గంలోని మాదిగ సామాజిక వర్గంలో బలమైన నాయకుడిగా ఉన్న శ్రీనివాసులుకు నామినేటెడ్ పదవి కేటాయించి దళితుల అభ్యున్నతికి సహకరించాలని సిఎం చంద్రబాబును కోరారు. విద్య, ఉపాధి, ఆర్థిక రంగాలలో వెనకబడ్డ మాదిగ సామాజిక వర్గానికి ఎస్‌సి వర్గీకరణ ద్వారా మాదిగల అభ్యున్నతికి పాల్పడిన సిఎం మందా శ్రీను కృషి గుర్తించి తగిన న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సూరేపల్లి మురళీధర్, జిల్లా అధ్యక్షులు ఎంబులూరు సుబ్రహ్మణ్యం, మండల అధ్యక్షులు గొంటు సుబ్రహ్మణ్యం, ఓబులవారిపల్లె మండలం అధ్యక్షులు లేబాక బాలనరసింహులు, పుల్లంపేట మండలం అధ్యక్షులు మినుకు సుబ్బారాయుడు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు

నా బిడ్డను ఆదుకోండి

చికిత్స పొందుతున్న నాగ చైతన్య

- అరుదైన వ్యాధితో బాధపడుతున్న నాగచైతన్య
- వైద్య సాయం అందించాలని తల్లి వేడుకోలు

ప్రజాశక్తి-సుండుపల్లి

అనారోగ్యంతో బాధప డుతున్న తన కుమారుడు నాగచై తన్యకు మెరుగైన వైద్యం అందించి కాపాడాలని తల్లి బోనంశెట్టి సుమలత కూటమి ప్రభుత్వాన్ని వేడుకుంటుంది. వివరాల్లోకి వెళ్తే..మండల పరిధిలోని దిన్నెమీద బలిజపల్లి గ్రామానికి చెందిన బోనంశెట్టి నాగచైతన్య ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. పది రోజుల క్రితం తీవ్ర జ్వరం రావడంతో రాయచోటిలోని ఓ ప్రయివేట్ వైద్యశాలలో చూపించారు. జ్వరం తగ్గకుండా తీవ్రమైన కడుపునొప్పి రావడంతో మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు వేలూరు సిఎంసికి తీసుకెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించారు. అక్కడ డాక్టర్లు వైద్య పరీక్షలు నిర్వహించి బోన్ బ్లడ్ కేన్సర్‌గా నిర్ధారించారని తెలిపారు. చికిత్స కోసం దాదాపు రూ.60లక్షలు ఖర్చు అవుతాయని డాక్టర్లు చెప్పడంతో ఆ నిరుపేద కుటుంబ సభ్యులు ఎటు తోచని దీనస్థితితో కుప్పకూలిపోయారు. తన భర్త జీవనోపాధి కోసం కువైట్‌లో పని చేసుకుంటూ జీవనాన్ని నెట్టుకొస్తున్నాడని, తమ బిడ్డకు ఈ వ్యాధి రావడంతో ఏం చేయాలో తమకు దిక్కుతోచలేదని బోరున విలపించారు. సిఎం చంద్రబాబు, డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేష్ లు తమ బిడ్డకు ప్రాణ బిక్ష పెట్టాలని ఆమె ప్రాధేయపడ్డారు. దాతలు కూడా ముందుకు వచ్చి తమ బిడ్డ వైద్యానికి సహాయం చేయాలని ముకులిత హస్తాలతో వేడుకుంటున్నారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

సన్మానం అందుకుంటున్న మస్తానయ్య

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల కేంద్రంలోని శాంతినికేతన్ స్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తు న్న ఆవ్వారు మస్తాన య్యకు తిరుపతి అపుస్మా కమిటీ ఆధ్వ ర్యంలో రాయలసీమ జిల్లాలోని పాఠశాలలో పుల్లం పేటలోని శ్రీ శాంతినికేతన్ హైస్కూల్ పాఠ శాల నుంచి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు ఫిజిక్స్ ఉపాధ్యాయుడు మస్తానయ్య ఎంపిక య్యారు. తిరుపతిలోని ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటో రియంలో జరిగిన అవార్డుల ప్రధాన ఉత్సవంలో టీచర్ ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డి, తిరుపతి ఎమ్మెల్యే చేతు లమీదుగా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందు కున్నారు. ఈ అవార్డు పట్ల పాఠశాల కర స్పాం డెంట్ శ్రీనివాసులు అభినందనలు తెలియజేశారు.

ఉత్తమ ఉపాధ్యాయ వార్డు అందుకుంటున్న సురేష్

మండల పరిధిలోని శ్రీ ప్రత్యూష హైస్కూల్‌లో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న సురేష్ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డును అందుకున్నారు. ప్రత్యూష హైస్కూల్‌లో గణితం ఉపాధ్యా యుడిగా పనిచ ేస్తున్న ఏరువ సురేష్‌కు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు రావడం పట్ల కరస్పాండెంట్ భానుప్రసాద్ ప్రత్యేకంగా అభినందించారు. **రైల్వేకోడూరు :** పట్టణంలోని విక్టరీ స్కూల్, అక్షర స్కూల్, విక్టరీ చిల్డ్రన్ స్కూల్‌లో పనిచేస్తున్న కొండూరు రజనీకాంత్, రాము, శివకుమార్ ప్రయివేట్ పాఠ శాలల అధ్యాపక బృందానికి ఇటీవల అపుస్మా ఆధ్వ ర్యంలో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంలో మూడు పాఠశాలలకు చెందిన ముగ్గురు ఉపాధ్యా యులును ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేశారు.ఈ నేపథ్యంలో ఆదివారం తిరుపతి జిల్లా నందు ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌లో వీరికి ఉత్తమ ఉపాధ్యా యులుగా మెమొంటోతో పాటు ఘన సన్మాన కార్యక్రమం నిర్వహించారు.

మునిగోటికి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు

మదనపల్లి : మదనపల్లికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయులు మునిగోటి శ్రీనివాసశర్మకు బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుఅందుకు న్నారు. ఆపన్న ప్రదీపన బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి బ్రాహ్మణ ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాల 2025 ప్రధానోత్సవం గుంటూరు బ్రాడీపేట బ్రాహ్మణ సేవా సమితి భవనంలో ఆదివారం ఘనంగా జరిగింది. అన్నమయ్య జిల్లా నుంచి ఏకైక అవార్డు గ్రహీతగా మదనపల్లె విశ్రాంత ప్రధానోపాధ్యాయులు, బ్రాహ్మణ సేవా సమాఖ్య పూర్వ అధ్యక్షుడు శ్రీనివా సశర్మను సన్మానించారు.

సన్మానం పొందుతున్న శ్రీనివాసవర్మ

పంచనామా భవనం నిర్మాణానికి నోచుకునేనా...?

- శవ పంచనామాకు మదనపల్లెకి వెళ్లాల్సిందే

ప్రజాశక్తి-బి.కొత్తకోట

పట్టణంలోని సిహెచ్‌సి ప్రభుత్వ ఆసుపత్రి దినదినాభివృద్ధి జరుగుతోంది. ప్రతి రోజూ 500కు పైగా ఒపిలు వస్తున్నాయంటే ఎంత అభివృద్ధి సాధిస్తుందో అర్థమవుతోంది. ఇక్కడ పంచనామాలు నిర్వహిం చేందుకు ప్రభుత్వం ఆమోదం కూడా తెలిపింది. అందుకు కావలసిన సిబ్బందిని సైతం నియమించారు. పంచనామా భవనాన్ని నిర్మాణ పనులు చేపట్టలేదు. ఇప్పటికైనా ఈ విషయంపై ఉన్నతాధికారులు దృష్టి సారించి సిహెచ్‌సిలో పంచనామా నిర్వహించేందుకు బిల్డింగ్ నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు. ఏవైనా మరణాలు సంభవిస్తే మదనపల్లికి వెళ్లడానికి, ఇతర ఖర్చులు రూ.15వేల వరకు వస్తున్నాయని ప్రజలు చెబుతున్నారు. నాణ్యమైన వైద్య సేవలతో పాటు అన్ని వసతులు కల్పిస్తే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. సూపరింటెండెంట్, వైద్యులు ప్రజలకు నాణ్యతమైన వైద్యం అందిస్తు న్నారన్నారు. కనుక ప్రజలు కార్పొరేట్ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రభుత్వ వైద్యశాలకి రావడంతో ఒపిలు ఎక్కువగా పెరిగాయని, డాక్టర్లు పనితీరు చాలా బాగుందని పలువురు ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి

వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదు : వైసిపి

ప్రజాశక్తి - కడప : పేద విద్యార్థులకు వైద్య విద్యను దూరం చేస్తే సహించేది లేదని మాజీ ఉప ముఖ్యమంత్రి అంజాద్‌బాషా, వైసిపి జిల్లా అధ్యక్షులు రవీంద్రనాథ్ రెడ్డి, కడప నగర మేయర్ సురేష్ బాబు అన్నారు. ఆదివారం రిమ్స్ సూపర్ స్పెషలిటీ, కేన్సర్, మానసిక వైద్యశాలలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలు కోరుకునేది విద్య, వైద్యం, ఉపాధి అన్నారు. కోట్లు వెచ్చించి వైద్యశాలలను నిర్మిస్తే అందుబాటులోకి తెచ్చి మెరుగైన వైద్యం అందిచ్చాల్సింది పోయి వాటిని ప్రయివేట్ పరం చేయడం ఏమిటి? అని ప్రశ్నించారు. కీ.శే. వై.ఎస్. రాజశేఖర్‌రెడ్డి విద్య వైద్యాన్ని చేరువ చేస్తే చంద్రబాబు ప్రయివేట్ పరం చేసి దూరం చేస్తున్నారని విమర్శించారు. .సూపర్ స్పెషలిటీ వైద్యశాలకు వైఎస్ పేరు తొలగించారని, ప్రజల గుండెల్లో ఆయన పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అన్ని రంగాలను అమ్మే కార్యక్రమానికి తెరాలేపారు అన్నారు. అయిదు మెడికల్ కళాశాలలు పూర్తయినా వాటిని వాడుకలోకి తీసురాకపోగా, సీట్లు వద్దని చెప్పి వెనక్కి పంపారు అన్నారు. ఇప్పుడు అన్ని మెడికల్ కాలేజీలను అనునాయులకు దోచి పెడుతున్నారని ఆరోపించారు. దుర్మార్గపు ఆలోచనను విరమించుకోకపోతే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తాం అని హెచ్చరించారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకులు పాల్గొన్నారు.

సమాజ ఉన్నతికి తోడ్పడాలి

ప్రజాశక్తి - బద్వేలు : సమాజ ఉన్నతికి ప్రతి జర్నలిస్టు కృషి చేయాలని బద్వేల్ మున్సిపల్ వైస్ చైర్మన్ సాయి కృష్ణ పేర్కొన్నారు. ఆదివారం శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆర్యవైశ్య జర్నలిస్టు సంక్షేమ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవ వేడుకలను రాష్ట్ర కన్వీనర్ రవికుమార్, కోకన్వీనర్ల ఆదేశాల మేరకు కడప, అన్నమయ్య ఉమ్మడి జిల్లాల జర్నలిస్టులతో కలిసి పట్టణంలోని వెంకటేశ్వర కల్యాణ మండపంలో వైభవంగా నిర్వహించారు. జర్నలిస్టులను వారి సేవలను అభినందిస్తూ శాలువాతో సత్కరించారు. ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి వారధిలా పని చేసే జర్నలిస్టులు సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో కడప, అన్నమయ్య జిల్లాల ఆవిర్భావ దినోత్సవ వేడుకల ఇన్‌ఛార్జి వల్లంకొండు వెంకటరమణ, చలపాటి రవికుమార్, జర్నలిస్టులు పాల్గొన్నారు

తాగునీటి బోరు వేస్తున్న సిబ్బంది

దేవళంపేటకు తీరనున్న తాగునీటి సమస్య

ప్రజాశక్తి-కలకడ

సంబేపల్లి మండలం ఎస్.సోమవరం పంచాయితీ దేవళంపేటలో నీటి ఎద్దడి చాలా రోజులుగా ఉండడంతో గ్రామస్తులు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డికి విన్నవించుకున్నట్లు తెలిపారు. మంత్రి స్పందించి ఆదివారం తాగునీటి బోరు వేయించినట్లు తెలిపారు. 45 అడుగుల లోతుకే నీరు పడటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వంలో నీటి ఎద్దడి నివార ణకు ఎన్నో పర్యాయాలు ప్రభుత్వా నికి విన్నవించుకున్నా పట్టించుకోలేదన్నారు. మంత్రి రాంప్రసాద్‌రెడ్డి చొరవ తీసుకొని బోరును వేయించడం ఎంతో ఆనందదాయకమని పేర్కొన్నారు. దేవళంపేటలో నెలకొన్న నీటి ఎద్దడికి మంత్రి, స్థానిక ప్రజాప్రతినిధుల చొరవతో శాశ్వత పరిష్కారం చూపార న్నారు. కార్యక్రమంలో సింగిల్ విండో డైరెక్టర్ వేణుగోపాల్ నాయుడు, రిటైర్డ్ జబ్బార్ సాహెబ్, దాను, ఇర్ఫాన్ భాష, కాలేషా, అహ్మద్‌బాషా, రవీంద్రనా యుడు, సయ్యద్ సాహెబ్, బడా బచ్చా, పజిల్ భాష, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో పీడీ నీలకంఠరావు

రాష్ట్ర స్థాయి పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థులు

ప్రజాశక్తి-పుల్లంపేట

మండల పరిధిలోని ఎపిమోడల్ స్కూల్‌లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో ఎంపిక ఇవ్వడం జరిగిందని పాఠశాల పీడీ నీలకంఠరావు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడూరులో నిర్వహించిన ఎస్‌జిఎఫ్ అండర్-19 తేక్వాండో పురుషులు, మహిళల విభాగంలో రిషిత్‌వర్మ 10వ తరగతి, కార్తీక్ 9వ తరగతి విద్యార్థులు జిల్లా స్థాయిలో అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.అండర్-19 స్కేటింగ్ విభాగంలో మనోజ్ఞరాజ్ పదవ తరగతి అద్భుత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికయ్యారని తెలిపారు. వైఎస్‌ఆర్ స్పోర్ట్స్ స్కూల్ కడపలో నిర్వహించిన అండర్-19 మహిళలు ఫుట్ బాల్ విభాగంలో మోడల్ స్కూల్ విద్యార్థులు హర్షిత ఇంటర్ రెండవ సంవత్సరం, జాస్మిన్ పదవ తరగతి విద్యా ర్థులు సెప్టెంబర్‌లో కర్నూలులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. ఫుట్‌బాల్ ఎస్‌జిఎఫ్ అండర్-19 పురుషుల విభాగంలో రితీష్‌వర్మ పదవ తరగతి సెప్టెంబర్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నట్లు తెలిపారు. కార్యక్రమంలో చంద్రమోహన్‌రాజు,ఎస్‌జిఎఫ్ సెక్రెటరీ శారద, రవిశంకర్‌రాజు, సుబ్బరాజు పాల్గొన్నారు.

నేటి నుంచి మండల స్థాయి ఆటల పోటీలు

ప్రజాశక్తి-తంబళ్లపల్లి

మండల పరిధిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఆటల పోటీలు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ ఎన్.హేమంత్‌కుమార్, పీడీ ఖాదర్‌బాషా పేర్కొన్నారు. అండర్-14, అండర్-17 బాలబాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, చెస్, యోగా, బాడ్మింటన్, అథ్లెటిక్స్ ఎస్‌జిఎఫ్ మండల స్థాయి పోటీలు ఎంపిక మోడల్ స్కూల్ లో ఈనెల 17, 18వ తేదీల్లో నిర్వహి స్తున్నట్లు తెలిపారు. స్కూల్ యాజమాన్యం తమ తమ జట్లను సంబంధిత అర్హత పత్రాలతో తప్పకుండా పంపి పోటీలను విజయవంతం చేయాలని కోరారు.

మదనపల్లి అభివృద్ధికి మహర్దశ

ప్రజాశక్తి-మదనపల్లె అర్బన్

కూటమి పాలనలో మదనపల్లి అభివృద్ధి మహర్దశను సంతరించుకు ంటోందని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా పేర్కొన్నారు. ఆదివారం పట్టణంలో మున్సిపల్ నిధులతో ఎస్‌బిఐ కాలనీలో మురుగునీటి కాలువ నిర్మాణం కోసం ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. అనంతరం రాంనగర్ పార్కులో సిమెంట్ రోడ్డుతోపాటు ఇతర అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు భూమిపూజ నిర్వహించారు. సిటిఎం రోడ్ బాపూజీ పార్కులో పిల్లల ఆట వస్తువులతో పాటు కాంపౌండ్ నిర్మాణం కోసం స్థానిక టిడిపి నాయకులతో కలిసి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ఐదేళ్ల వైసిపి పాలనలో సిఎఫ్ఎంఎస్ పేరుతో మున్సిపల్ నిధులను రాష్ట్ర ఖజానాకు మళ్ళించుకుని రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల అభివృద్ధికి అడ్డుకట్ట వేశారన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారంలోకి రాగానే సిఎఫ్ఎంఎస్‌ను రద్దు చేసేందుకు తీవ్రంగా కృషి చేశారని, ప్రస్తుత సిఎంఎఫ్ఎస్ రద్దు కావడంతో మున్సిపాలిటీలో అభివృద్ధి జోరందుకుంటోందన్నారు. గత ఐదేళ్ల పాలనలో కాంట్రాక్టర్లు పనులు చేసేందుకు ముందుకు వచ్చేవారు కాదని, కూటమి పాలనలో ప్రభుత్వంలోకాంట్రాక్టర్లు ముందుకు వస్తున్నారని తెలిపారు. అభివృద్ధి చేయడం అంటే టిడిపికి మాత్రమే సాధ్యమవుతుందని పేర్కొన్నారు. పట్టణంలో వర్షాల కారణంగా దోమలు పెరిగి, ప్రజలు జ్వరాలతో బాధపడుతున్నారని, ఫాగింగ్ చేయించేందుకు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల సచివాలయ ఉద్యోగులు, తెలుగుదేశం నాయకులు శ్రీరామ సహదేవ నాయుడు, బాబ్జి, నాదెళ్ల శివప్రసాద్, ఆర్ఎస్ షంషీర్, బీదం గురునాథ్ యాదవ్, శ్రీరాములు, బెల్లె రెడ్డి ప్రసాద్, జాఫరున్నిసా, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో వాచ్‌మెన్ మృతి

ప్రజాశక్తి-కలికిరి

రోడ్డు ప్రమాదంలో కళాశాల వాచ్ మెన్ హరినాథ్ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కలికిరి తిరుపతి మార్గంలోని తిమ్మారెడ్డిగారి మాదిగపల్లికి చెందిన ఎం.హరినాథ్(42) కళాశాలలో గెస్ట్ హౌస్ వాచ్‌మెన్‌గా విధులు నిర్వహిస్తున్నాడు.ఆదివారం సాయంత్రం విధులు ముగించుకుని బైక్‌లో ఇంటికి వెళుతూ చింతలవారిపల్లె వద్ద రోడ్డు పక్కన చెట్ల పొదల్లో పడి తీవ్రంగా గాయపడి ఉండటాన్ని స్థానికులు గుర్తించి వారి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడిని హుటాహుటిన కలికిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తుండగా మృతి చెందాడు. గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో హరినాథ్ మృతి చెందాడని కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ మదన్ మోహన్‌రెడ్డి తెలిపారు.